nirdhesham.com
daily digital

మన దిశా నిర్దేశం

తగిలిన ప్రతి గాయాన్ని
జ్ఞాపకంగా గుర్తుపెట్టుకుంటే అది భాద
ఆ తగిలిన ప్రతి గాయాన్ని
పటంగా మార్చుకుంటే
అది మార్పు ఎందుకంటే.
ముల్లుని తొక్కిన కాలుతో
భాద పడుతూ అక్కడే ఉండి పోకూడదు.
ఈ సారి జాగ్రత్తగా
నడవడం మొదలు పెట్టాలి.

నిర్దేశం
మన దిశా నిర్దేశం
హైదరాబాద్ | శనివారం | 16-09-2023

### హెచ్‌సిఏ ఎన్నికల నిర్వహణకు

# సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్




**నిర్దేశం, ఢిల్లీ:** హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) వివాదాలకు అడ్డాగా మారిన విషయం తెలిసిందే. ఈ వివాదం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. కాగా, తాజాగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం హెచ్‌సీఏలో ఉన్న గందరగోళాన్ని తొలగించా లి అంటే.. ఎన్నికల నిర్వహణ ఒక్కటే మార్గం అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. గతంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో గుర్తింపు, సంఘంలో నెలకొన్న పలు అంశాలపై సుప్రీంకోర్టును హెచ్‌సీఏ, క్రికెట్ అసోసియేషన్, కాంగ్రెస్ నేత అజహరుద్దీన్, జాన్ మనోజ్, బుడ్డింగ్ స్టార్ క్రికెట్ అసోసియేషన్‌లు కోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధులియా ధర్మాసనం అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించి.. కొత్త కమిటీ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో వేచి చూడాలని పేర్కొంది. హెచ్‌సీఏ వ్యవహారాలపై గతంలో సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ లావు నాగేశ్వరరావు ఏకసభ్య కమిషనే ఎన్నికలు నిర్వహించాలని ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

### అమిత్ షా తెలంగాణ పర్యటనలో

# స్వల్ప మార్పులు

**నిర్దేశం, హైదరాబాద్:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటనలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. ఈనెల 17వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమిత్ షా హాజరవుతున్నారు. కాగా, ఈ నెల 16వ తేదీన రాత్రి 7:20 గంటలకు ఆయన హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. రాత్రి 8 గంటలకు సీఆర్పీఎఫ్ సెక్టార్ మెస్‌కు చేరుకుంటారు. ఆరోజు రాత్రి అక్కడే కేంద్ర మంత్రి షా బస చేయనున్నారు. 17వ తేదీ ఉదయం 9 గంటలకు పరేడ్ గ్రౌండ్‌కు చేరు కుంటారు. సాయుధ బలగాల గౌరవ వంద నం స్వీకరిస్తారు. ఆపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తారు. 11:10 నిమిషాల వరకు పరేడ్ గ్రౌండ్ వేదికగా తెలంగాణ విమోచన దినోత్సవాలు జరగనున్నాయి. వేడుకల అనంతరం 11:15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సీఆర్ పీఎఫ్ సెక్టార్ మెస్‌కు చేరుకుంటారు. 11:50నుంచి మధ్యాహ్నం 1:45 వరకు అక్కడే ఉండను న్నారు. ఈ రెండు గంటల్లో ఆయన ఎవరితో భేటీ అవు తారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. సీఆర్ పీఎఫ్ మెస్ నుంచి 1:45 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరుతారు. 2:25 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు.

# కూచునే హక్కు మీకుంది!

**నిర్దేశం, హైదరాబాద్:**




**జయవాణి (35) నెల్లూరులో ప్రయివేట్ టీచర్. క్లాస్‌రూమ్‌లో నిలబడే పాఠం చెప్పాలి. బ్లాక్‌బోర్డ్ దగ్గర కుర్చీ కానీ టేబుల్ కానీ ఉండవు. టీచర్లు తాము ఇచ్చే జీతానికి ప్రతి నిమిషం రెక్కలు ముక్కలు చేసుకోవాలనుకున్న ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు చాలా కాలంగా క్లాస్ రూముల్లో కుర్చీలు తీసేశాయి. పాఠం ఎగ్గొట్టి టీచర్లు విశ్రాంతి తీసుకుంటారనో కునుకు తీస్తారనో వారి అనుమానం కావొచ్చు. అయితే క్లాసుకు క్లాసుకు మధ్య గ్యాప్ ఇస్తారా? స్టాఫ్‌రూమ్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకోనిస్తారా? రోజులో దాదాపు 4 నుంచి 6 క్లాసులు చెప్పాల్సి ఉంటుంది. ప్రతి క్లాసు నిలబడి చెప్పి చెప్పి జయవాణికి మోకాళ్ల నొప్పులు మొదలయ్యాయి. కాని ఏమిటి చేయడం. ఆమె నిలబడి చెప్పాల్సిందే. కూచుని పాఠం చెప్పే హక్కు ఆమెకు లేదా?**



కేరళ, తమిళనాడు రాష్ట్రాలు సేల్స్‌గర్ల్స్‌ను అన్నేసి గంటలు నిలబడి డ్యూటీ చేయించడాన్ని నిరోధించాయి. కేరళలో 'రైట్ టు సిట్' ఉద్యమం మొదలయ్యాక వచ్చిన మార్పు ఇది. దేశంలో కోట్లాది మంది స్త్రీలు సేల్స్ గర్ల్స్‌గా 8 నుంచి 12 గంటలు నిలబడి పని చేస్తున్నారు. వారికి కూచునే హక్కు ఉంది. ఆ హక్కు ప్రభుత్వాలు కల్పించాల్సి ఉంది.

మాలతి (20) హైదరాబాద్ అమీర్‌పేటలో సేల్స్ గర్ల్. ఉదయం 9 గంటలకు క్లాత్ షోరూమ్‌లో డ్యూటీ ఎక్కుతుంది. తిరిగి రాత్రి 9కి డ్యూటీ దిగుతుంది. మధ్యలో అరగంట లంచ్ విరామం. మిగిలిన సమయం? అంతా నిలబడి ఉండటమే. కష్టమర్లు ఉన్నా లేకున్నా ఆమె నిలబడే ఉంటుంది. కూచోవడానికి వీల్లేదు. ఎందుకంటే కూచోవడానికి అక్కడ కుర్చీలు గానీ స్టూల్స్‌గాని ఉండవు. బద్ధకానికి అలవాటు పడతారని లేదా కూచుని సుఖపడతారని షాప్ వాళ్లు వారిని కూచోకుండా స్టూల్స్ తీసేస్తారు. మాలతి నిలబడే ఉంటుంది. నిలబడి.. నిలబడి.. నిలబడి.. ఆమెకు కూచునే హక్కు లేదా?

నిలబడటం పనిలో ఒక భాగం కావచ్చు. కాని నిలబడి ఉండటమే పని కాబోదు. కారాదు. మనిషి కేవలం నిలబడి మాత్రమే పని చేయడు. మధ్యలో విశ్రాంతి కావాలి. కూచోవాలి. కాని కూచుని పని చేయడాన్ని దేశంలో అనధికారికంగా కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో తొలగించి చాలాకాలం అయ్యింది. బట్టల దుకాణాలు, నగల దుకాణాలు, ఎలక్ట్రానిక్ షోరూమ్‌లో, ప్రయివేటు పాఠశాలలు.. ఒకటేమిటి ప్రయివేటు రంగంలో ఎక్కడ వీలైతే అక్కడ నిలబడి పని చేయించడం ఆనవాయితీ అయ్యింది. ఇంకా దారుణం ఏమంటే కూచుని కనిపిస్తే, తోటి ఉద్యోగులతో కబుర్లు చెప్తూ కనిపిస్తే కొన్ని షాపుల్లో 'ఫైన్' వేస్తారు. షాపింగ్ మాల్స్‌లో సేల్స్ గర్ల్స్ చేత, సేల్స్ బాయ్స్ చేత ఎంత ఊడిగం చేస్తారో వారిని ఎలా నిలబెట్టి పని చేయిస్తారో తమిళంలో 'షాపింగ్ మాల్' అనే సినిమా చూపించింది.

**కేరళలో కదలిక**

దేశంలో బట్టల షోరూమ్‌లలో దాదాపు నాలుగున్నర కోట్ల మంది సేల్స్‌గర్ల్స్‌గా/సేల్స్‌మెన్‌గా ఉపాధి పొందుతున్నారని ఒక అంచనా. వీరిలో దాదాపు 70 శాతం యువతులు, స్త్రీలు ఉంటారు. వీరందరూ రోజుకు 8 నుంచి 12 గంటలు నిలబడి పని చేయాలని షోరూమ్‌ల యజమానులు అన్యాపదేశంగా సూచిస్తారు. కష్టమర్లు ఒకరి వెంట ఒకరుగా రావడం వల్లగాని లేదా స్టూల్స్ లేకపోవడం వల్లగాని వీరు కూర్చునే వీలు లేదు. నీరసం ఉన్నా, పిరియడ్స్‌లో ఉన్నా, నిలబడే శక్తి లేకున్నా వీరు నిలబడి ఉండాల్సిందే.

దీని వల్ల వీరికి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. అరికాళ్లు, మోకాళ్లు బాధిస్తున్నాయి. దాంతో 2018లో 'రైట్ టు సిట్' అని కూచునే హక్కు కోసం అక్కడ కొంతమంది సేల్స్ గర్ల్స్ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారి డిమాండ్‌లో సబబును గ్రహించింది. 2019 జనవరిలో కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్లలో పని చోట ఉద్యోగులందరూ తప్పనిసరిగా కూచునే ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర 'కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్'ను సవరించింది.

**ఇప్పుడు తమిళనాడులో**

మొన్నటి సెప్టెంబర్ 13న తమిళనాడు అసెంబ్లీలో కూడా ప్రయివేటు ఉద్యోగుల కూచునే హక్కుకు హామీ ఇస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం 'తమిళనాడు షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ - 1947'ను సవరించింది. ఏ షాప్ అయినా షోరూమ్ అయినా ప్రయివేటు ఉపాధి స్థలం అయినా ఉద్యోగులు కూచునే ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని యజమానులను ఈ సవరణ ఆదేశిస్తుంది. కూచుంటే ఎక్కడ యజమాని తిడతాడో అని భయపడాల్సిన అవసరం ఇక మీదట లేదు.

దేశంలో ప్రయివేటు ఉద్యోగుల కూచునే హక్కుకు హామీ పలికిన తొలి రాష్ట్రంగా కేరళ గుర్తింపు పొందింది.

**రెండు రాష్ట్రాలే మిగిలిన దేశంలో?**

అయితే ఇది మొదలు మాత్రమే. దేశంలో ఇంకా ఎంతో కదలిక రావాల్సి ఉంది. ఆయా ప్రభుత్వాలు ఈ సమస్యను గుర్తించాల్సి ఉంది. ఉద్యోగిని నిలబెట్టి ఉంచడం ఆ ఉద్యోగి ఆత్మ గౌరవానికి భంగం కలిగించడం.

అవమానించడం. బాధించడం. అనవసర శ్రమకు, ఒత్తి డికి గురి చేయడం. గౌరవంతో కూడిన పని చేసే హక్కు, గౌరవాన్ని పొందుతూ పని చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. 'స్త్రీలను గౌరవిం చడం మన సంప్రదాయం' అని అంటాం. కాని వందలాది దుకాణాల్లో వేలాది సేల్స్ ఉమెన్, రిసెప్షనిస్ట్స్, టీచర్లు, ఇతర ప్రయివేటు ఉద్యోగులు ఎందుకు నిలుచుంటున్నారో.. అంత నిలబడాల్సిన అవసరం ఏమిటో ఆలోచించాల్సి ఉంది. అవును. 'కూచుని పని చేసే హక్కు' ప్రతి ఒక్కరికీ ఉంది.

సేకరణ: కాపు శ్రీనివాస్

## చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా



**నిర్దేశం, విజయవాడ:** టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ చుక్కెదురైంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో చంద్రబాబుకు బెయిల్, మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆయన తరపున విజయవాడ ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు అయింది. ఈ పిటిషన్లపై ధర్మాసనం విచారణ చేపట్టింది. దీంతో కౌంటర్ దాఖలు చేయ డానికి సమయం కావాలని సీఐడీ తరపు న్యాయవాది కోరారు. సాయం త్రం 4 గంటలకు ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి విచారణకు వస్తారని న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు విచారణను మంగళవారా నికి వాయిదా వేసింది. ప్రస్తుతం చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలు ప్రత్యేక ఖైదీగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి కోర్టులో వాదనలు జరుగుతుండటంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. చంద్రబాబుకు త్వర, గా బెయిల్ రావాలని కోరుకుంటున్నారు.

## కొత్త గెలాక్సీని కనుగొన్న ఖగోళ శాస్త్రవేత్తలు



**నిర్దేశం, హైదరాబాద్:** ఖగోళ శాస్త్రవేత్తలు కాస్మిక్ రిబ్బన్‌తో గిఫ్ట్ లాగా చుట్టబడిన ఒక కొత్త గెలాక్సీని కనుగొన్నారు. ఇది భూమి నుంచి 56 మిలియన్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. ఇటీవల తాము ఒక ప్రత్యేకమైన 'పోలార్ రింగ్ గెలాక్సీ (పిఆర్‌జి)'ని కనుగొన్నామని, ఇది సాధారణ గెలాక్సీ దిశకు లంబంగా ఉన్న పదార్థం యొక్క డిస్క్‌ను కలిగి ఉందని వెస్టర్న్ ఆస్ట్రేలియాకు చెందిన ఆస్ట్రానమర్స్ పేర్కొన్నారు. పరిశోధనల్లో భాగంగా ఇటీవల స్పైరల్ గెలాక్సీలో ఒక కొత్త ఆకారాన్ని 'ఆస్ట్రేలియన్ స్క్వేర్ కిలోమీటర్ అర్రే పాత్‌ఫైండర్ రేడియో టెలిస్కోప్'ని ఉపయోగించి వారు కనుగొన్నారు. దానికి ఎన్‌జిసి 4632 అని పేరు పెట్టారు. దీని చుట్టూ హైడ్రోజన్‌తో కూడిన ఒక అనంతమైన రిబ్బన్ ఉన్నట్లు గుర్తించారు. వాస్తవానికి 2022లో కూడా స్పైరల్ గెలాక్సీ చుట్టూ ఒక బేసి గ్యాస్ నిర్మాణాన్ని ఖగోళ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అయితే తాజాగా అది హైడ్రోజన్‌తో కూడిన ఒక రిబ్బన్ వంటి ఆకారమని నిర్ధారణకు వచ్చారు.

## అంబేడ్కర్ ఇల్లును సందర్శించిన విమలక్క



**నిర్దేశం, ముంబై :** సకల్ భారత్ సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముంబైలో గద్దర్ యాది సభకు విచ్చేసిన తెలంగాణ పోరుబిడ్డ ప్రజా గాయకులు విమలక్క బాబాసాహెబ్ అంబేడ్కర్ ఇంటిని సందర్శించారు. ముంబైకి చేరుకున్న విమలక్క తాను అంబేడ్కర్ నివాసాన్ని చూడాలని, దాని నుంచి స్ఫూర్తి పొందానికి చూడాల్సిందే అన్నారు ఆమె. ముంబై కార్యకర్తలు ఆమెను, అరుణోదయ టీంను అక్కడికి తీసుకు వెళ్లారు. అయితే పరెల్ లోని బి.ఐ.టి చాల్ లోవున్న రూం నం:51 నందు డాక్టర్ అంబేడ్కర్ 1912 నుంచి 1934 వరకు ఆ చాల్ లోనే 22 ఏండ్లు తన ఉద్యమ జీవితాన్ని గడిపిన విషయాన్ని విమలక్కకు వారు వివరించారు. సత్యాగ్రహ ఉద్యమం, గాంధీతో పూణే ఒడంబడిక, మనుస్మృతి దహనం, మాన్గావ్ పరిషత్ తదితర ఉద్యమాలు జరిగిన స్థలాన్ని చూశారు విమలక్క.

# సెప్టెంబర్ 17న తలవంచిన నిజాం



'నేనెవరికీ భయపడను, నేనే దేవుణ్ణి అని ప్రచారం చేసుకున్న ఏడవ నిజాం. ఉక్కుమనిషి, సర్దార్ వల్లభాయ్ పటేల్ ముందు విమానాశ్రయంలో తలవంచి నమస్కరించి స్వాగతం పలికాడు. దేశం మొత్తం 1947 ఆగస్టు 15వ తేదీనే పరతంత్రం నుండి విముక్తి పొందినా, తెలంగాణకు మాత్రం 1948 సెప్టెంబర్ 17న విముక్తి లభించింది.

**'మన అన్నల చంపిన**
**మన చెల్లెళ్ల చెరిచిన**
**మానవాధములను**
**మండలాధీశులను**
**మరిచిపోకుండగ గుర్తించుకోవాలె**
**కాలంబురాగనే కాటేసి తీరాలి**
**పట్టిన చేతులను పొట్టులో బెట్టాలె**
**తన్నిన కాళ్ళను దాగలిగ వాడలె...'**
**– కాళోజి**

ఏ దృశ్యం ఈ కవిత చెప్పటానికి కాళోజి కలాన్ని కదలించింది?

ఏ భావం కాళోజి కన్నీళ్లను కరిగించి అక్షరాలుగా మార్చింది?

ఏ సంఘటనకు కాళోజి హృదయస్పందన కవితాధారాలై స్పందించింది?

అదే 1948లో జరిగిన రజాకార్ల దారుణ స్వైరవిహారం. అది ఒక కాళోజినే కాదుబీ యావత్ తెలంగాణ ప్రజలందరి గుండెల నుండి అగ్గిరవ్వలు రేపిన సంఘటన! మతోన్మాద శక్తులైన రజాకార్లకు కొమ్ముగాసిన హైదరాబాద్ ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కుతంత్రాలతో తల్లడిల్లిన తరుణం. వేలాదిమంది ధీరుల త్యాగాలతో తెలంగాణ క్షేత్రం రక్తసిక్తమైన వైనం. దాస్య శృంఖలాల నుండి భరతమాత బంధాలు విడివడినా, తెలంగాణా మాత్రం పరతంత్రం నుండి విముక్తి కాకపోవడం ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచింది.

కానీ.. విధి విచిత్రం కదా ! 'సైనిక దాడుల నైనా అరికట్ట వచ్చును కానీ ప్రజల హృదయాంతరాళాల నుండి పెల్లుబికి వచ్చే స్వతంత్ర భావతరంగాలను ఆపజాలరానేది చరిత్రలో ఋజువైన సత్యం' అని ఓ చరిత్ర కారుడన్నట్లు రజాకారు మూకల దాడుల నేదుర్కోవ డానికి సమాయత్తమైన ఈ పోరుగడ్డ ప్రజల ధైర్యసాహసాలను వేనోళ్ళ పొగడవచ్చు.

తెలంగాణ గడ్డపై హిందూ ప్రజలపై నాటి రజాకార్లు చేసిన దురాక్రమణ గురించి భగవంతుడే స్వయంగా విన్నదేమో అన్నట్లు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ రూపంలో రక్షణ కవచం దొరికింది. అదే దక్కను పీఠభూమి ప్రజలకు భరతమాత ఒడిలో వాలే అవకాశం దక్కినరోజు. అదే సెప్టెంబర్ 17, 1948. ఆ రోజే నిజాం నవాబు ఉక్కుమనిషి చెంత మోకరిల్లిన రోజు. అదే అదే తెలం గాణ విమోచన దినం.

– శేరు పోశెట్టి, ఆర్మూర్,
సేకరణ: జాగృతి వారపత్రిక

# తెలంగాణ మూడు రోజులు భారీ వర్షాలు



**నిర్దేశం, హైదరాబాద్:** తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ అలర్ట్ జారీ చేసింది. రాబోయే మూడు రోజుల పాటు కూడా వర్షాలు కొనసాగే అవకాశముందని హెచ్చరించింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణశాఖ ప్రజలకు పలు సూచనలు జారీ చేసింది. రాబోయే మూడు రోజులు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇలాగే పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఆదిలాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని స్పష్టం చేసింది. అల్పపీడనం తూర్పు మధ్యప్రదేశ్ పరిసరాల్లో కొనసాగుతోందని, దీనికి తోడు మరో ఆవర్తనం కూడా వ్యాపించి ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. సముద్రమట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఆవర్తనం వ్యాపించి ఉందని, దీని ప్రభావంతో పశ్చిమ దిశ నుంచి గాలులు వీస్తాయంది. కాగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా గత కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లోనూ వానలు పడుతున్నాయి. ఇవాళ ఉదయం కూడా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి.

# మావోయిస్టు అగ్రనేత అరెస్ట్

**నిర్దేశం, హైదరాబాద్ :** సీపీఐ (ఎం. ఎల్) మవోయిస్టు కేంద్ర కమిటీ సభ్యు లు సంజయ్ దీపక్ రావును శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్ర థానే జిల్లా అంబర్ నాథ్‌కు చెందిన ప్ర ముఖ నక్సలైట్ సంజయ్ అనారోగ్యంతో హైదరాబాద్ విచ్చేసారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు అందిన సమాచారం మేరకు సంజయ్ ను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు డీజీ పీ అంజనీకుమార్ యాదవ్. కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో నక్సలైట్ కార్యకలపాలు నిర్వహించారన్నారు ఆ యన. గతంలో రెండు మార్లు సంజయ్ ను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు.

## కవిత్వం

### కొలిమిని రాజేస్తున్నా!!

కూతవేటు దూరంలో
ఊరికి చివర పొలిమేర సందులో
సింధూరం తిలకం దిద్ది
కొలిమిని రాజేస్తున్నా!!...
కాలం ఊపిరితో ప్రకృతి ధర్మంతో
మానవ మనగడకోసం
బడుగు బతుకుల బాగుకోసం!!...
మానవీయతను నిలపటం కోసం!!..
అక్షరాలను సానబెట్టుచున్న
సంకల్పబలంతో సాగదీస్తున్న
ప్రజల బాగుకోసం బతుకు
ప్రగతి కోసం!!...
అక్షరాన్ని ఓ ఆయుధంగా చేయడానికి
భావాన్ని మరిగిస్తున్నా...
కష్టాల కొలిమిలోనే అక్షరాలకు
సానబెట్టితేనే
నిజం నిప్పులై రాలుతుంటాయి!!..
నేలమీద పరుచుకున్న
అరాచకాన్ని కాల్చివేయడానికి...
అమానుషాన్ని కూల్చివేయడానికి..
వేధించేవారిని..బాధించేవారిని
బతుకులను కూల్చేవారిని...
తొలగించడానికి కావాలి ఒక
ఆయుధం!!...
బొద్రాయి దగ్గర బోర్డు పెట్టి
దళారుల గుండెలో దడ పుట్టిస్తా!!..
దండకారణ్యములో పదునైన పదాలతో
శక్తివంతమైన చైతన్యముతో
అక్షరాల జెండా పాతేస్తా!!...
చీకటిని చీల్చి ఉషస్సుకు ఉపిరిపోస్తా!!..
అడవిని దోపిడిచేసే అధములను
అణిచివేయడానికి..
సమాజం నడిబొడ్డున
అక్షరమై నిలబడతా!!..
దొంగవేషాలు..మోసాలు చేసేవారి
అవినీతిని,అన్యాయాన్ని
కనిపెట్టి పనిపడతా!!...
అక్షరాయుధాన్ని ఉపయోగిస్తా!!...
గురిచూసి గుండెపై నిలుపుతా!!...
నెత్తురును మండించి శక్తులను నిలబెట్టి
మరోచరిత్రకు ఊపిరిపోస్తా!!...
విరుచుకు పడుతున్న చీకటి తలలపై..
పట్టపగ్గాలులేనిజి
స్వార్ధపు మనషుల అలలపై...
అక్షరాలను ఎక్కుపెడతా!!...
దురహంకారులపై..
సంఘవిద్రోహశక్తులపై..
భావ వేగమున అక్షరమై గర్జిస్తా!!...
దౌర్జన్యపు సుడిగాళ్లపై
అక్షరాల అగ్నివర్షం కురిపిస్తా!!...
స్వేచ్ఛమైన జీవితాలకు
అక్షరాల కంచె వేస్తా!!...
అక్షరాలనే కాపలపెడతా!!...
మార్పుకోసం మానవత్వపు
దీపం వెలిగిస్తా!!...

అంబటి నారాయణ
నిర్మల్
9849326801